క్లుప్తంగా

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సహాయకులు

బేతంచెర్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు రామయ్య, నాగేంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు. పేస్కేల్ అమలుతోపాటు అర్హులైన వారికి అటెండర్, వాచ్‌మన్‌లుగా ప్రమోషన్ కల్పించాలని కోరారు.

వీఆర్‌ఏల ధర్నా

ప్యాపిలి: వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు తలారి ఓబులేసు, ఉపాధ్యక్షుడు తలారి నబి రసూల్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వీఆర్‌ఏలు ధర్నా చేపట్టారు.

రేపు సీహెచ్‌సీలో వైద్య శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేయనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్వస్త్‌నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

పిచ్చి మొక్కల తొలగింపు

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాల వద్ద పేరుకుపోయిన పిచ్చి మొక్కలను గురువారం తొలగించారు. చాలా రోజుల నుంచి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉండేది. ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా మారింది. సర్పంచ్ శివరాముడు చొరవ తీసుకుని జేసీబీ సాయంతో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు.

బిల్లులు ఇప్పించాలని వినతి

బేతంచెర్ల: కోటపేట కందకం అభివృద్ధి పనులు పూర్తి చేసి రెండేళ్లు గడిచినా బిల్లులు విడుదల కాలేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన అనంతపురం రీజినల్ డైరెక్టర్ నాగరాజుకు కాంట్రాక్టర్లు రామచంద్రుడు, పుల్లయ్య వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ కాలంలో రూ.4 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మించినా ఇప్పటి వరకు బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రీజనల్ డైరెక్టర్ హామీ ఇచ్చారు.

లైన్‌మన్ మృతికి నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాటసాని

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని గుండ్లశింగవరానికి చెందిన లైన్‌మన్ నరసింహులు(44) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, కాటసాని ప్రసాద్‌రెడ్డి గుండ్లశింగవరానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ ఫక్కీరయ్యతో పాటు సిబ్బంది నివాళులర్పించారు.

పరామర్శ

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సజ్జాద్‌హుస్సేన్ తండ్రి సయ్యద్ ముర్తుజా హుస్సేన్ ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

బేతంచెర్ల: వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బేతంచెర్ల కేజీబీవీ విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రథమ, డిబేట్ పోటీలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ అబీదా బేగం తెలిపారు. వీరంతా వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జగాళ్ల లింగన్న అన్నారు. పట్టణంలోని మారెమ్మ ఆలయ ఆవరణలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని చెత్తచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. పార్టీ నాయకులు అప్పపోగు వెంకటసుబ్బయ్య, ఎంవీ సుబ్బయ్య, నరసింహులు,ఉసేని,బన్నియాదవ్ పాల్గొన్నారు.

కొత్త సర్వీసులపై బాదుడే బాదుడు

- రెండింతలు పెరిగిన సర్వీస్ రేట్లు
- సామాన్యులపై భారం
- మరో వైపు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు



కొలిమిగుండ్లలోని జగనన్న కాలనీ



వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లు

కొలిమిగుండ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం.. తగ్గిస్తామని నాయకులు సభల్లో హోరెత్తించారు. తీరా అధికారంలోకి వచ్చాక మేం మాట మీద నిలబడమని మరోసారి నిరూపించుకున్నారు. కొత్తగా గృహాలు, వాణిజ్య సముదాయాలు తదితర నిర్మాణాలు చేసుకున్న వాళ్లు నూతన విద్యుత్ సర్వీస్ ఏర్పాటు చేసుకోవాలంటే కూటమి ప్రభుత్వం రెండింతల ధరలు పెంచి వినియోగదారుల నుంచి ముక్కు పిండి వసూలు చేసేందుకు సిద్ధమైంది. దీంతో ప్రజల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచారని ఊరు,వాడ ప్రజల్లోకి వెళ్లి విష ప్రచారం చేశారు. ఇప్పుడేమో ప్రజల నడ్డివిరుస్తున్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు వద్దన్న వాళ్లే బలవంతంగా అమర్చుతున్నారు.

భారీగా పెరిగిన కొత్త సర్వీసులు

నూతన విద్యుత్ సర్వీస్ తీసుకోవాలంటే ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. గృహ విద్యుత్ వినియోగదారులు ఒక కిలోవాట్ తీసుకోవాలంటే అన్ని రకాల చార్జీలు కలిపి రూ.1800 మేర ఉండగా ప్రస్తుతం చలానాతో కలిపి రూ.3800 పైగానే వసూలు చేస్తున్నారు. 2కిలో వాట్స్‌కు రూ.3750 ఉండగా రూ.6800 వరకు రాబడుతున్నారు. కమర్షియల్ సర్వీస్ కిలో వాట్‌కు రూ.2250 ఉంటే రూ.4300 వరకు పెంచారు. 2కిలో వాట్‌లకు రూ.4500 నుంచి రూ.8400 మేర చేశారు. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. ఆ సమయంలో ప్రభుత్వమే ఉచితంగా మీటర్, విద్యుత్ కనెక్షన్ ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం పాత మీటర్లను తొలగించి కొత్త మీటర్ తీసుకోవాలని విద్యుత్ సిబ్బంది హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

గిర్రున తిరుగుతున్న స్మార్ట్ మీటర్లు

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడంతో మీటర్ రీడింగ్ గిర్రున తిరుగుతుండడంతో వినియోగదారులు వేలకు వేలకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఇందులో రకరకాల చార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లను వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర వాటికి అమర్చారు. త్వరలోనే గృహాలకు స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమీటర్ ఏర్పాటైతే పూటకో టారిఫ్ విధించే అవకాశాలు ఉన్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక టారిఫ్, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఒకరకంగా.. సాయంత్రం నుంచి ఇంకో రకమైన టారిఫ్ విధించనున్నారు. స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ రీచార్జ్ తరహాలో ముందుగానే చేసుకోవాల్సి ఉంటుంది. మీటర్‌లో రాత్రి వేళల్లో డబ్బులు అయిపోతే గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి.

దసరా మహోత్సవాలకు ఆహ్వానం

బనగానపల్లె: దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి గురువారం ఆయన స్వగృహంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు అందజేశారు. సంఘం తరఫున దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గాథంశెట్టి వేణుగోపాల్, నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయకుమార్, రామసుబ్రమణ్యం, శివచంద్రయ్య, నాగరాజు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

సంజామల: వ్యవసాయాన్ని సులభతరం చేసేందుకు నానో యూరియాను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి భూమ జ్యోతి రైతులకు సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. సాధారణ యూరియా బస్తా వాడితే 35 శాతం మాత్రమే మొక్కలకు చేరుతుందని, మిగతాది ఆవిరైపోతుందని చెప్పారు. కానీ నానో యూరియా లిక్విడ్ వాడితే 80 శాతం వరకు ప్రభావం చూపుతుందని తెలిపారు. ఒక యూరియా బస్తాకు ప్రభుత్వం కంపెనీకి రూ.1,970 రాయితీ అందిస్తోందని పేర్కొన్నారు. యూరియాను తగ్గించి నానో యూరియాను వాడితే దేశ అభివృద్ధికి రైతు పాత్ర మరింతగా నిలుస్తుందని సూచించారు.

పండ్ల తోటలతో రైతులకు ఆదాయం



రెడ్డిపల్లెలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

సంజామల: రైతులు సాధారణ పంటలకే పరిమితం కాకుండా ఉద్యాన పంటల వైపు అడుగులు వేయాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణ సూచించారు. గురువారం ఆయన సంజామల, కానాల, రెడ్డిపల్లె గ్రామాల్లో పండ్లతోటలు, పశువుల తొట్లు, ఎరువుల గుంతల పనులను పరిశీలించారు. ఆయిల్‌పామ్ తోటలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఇస్తాయని రైతులకు సూచించారు. అంతర పంటలు వేసుకోవచ్చని చెప్పారు. గ్రామాల్లో కంపోస్ట్ పిట్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించి, ప్రభుత్వం నుంచి వచ్చే టాస్క్‌లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంబశివరావు, ఎంపీడీఓ సాల్మన్, ఏపీఓ రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణతోనే గ్రామాల పరిశుభ్రత

సంజామల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలని నంద్యాల డివిజన్ అభివృద్ధి అధికారి శివారెడ్డి సూచించారు. గురువారం ఆకుమల్ల, ముక్కమల్ల గ్రామాలను ఎంపీడీఓ సాల్మన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఆదేశించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో గ్రామాల్లో ప్లాంటేషన్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఈఓఆర్డీ రాధికారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగలక్ష్మి, భారతి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్లాస్టిక్ నిర్మూలన



మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్

బేతంచెర్ల: పర్యావరణానికి పెను ముప్పుగా ఉన్న ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అనంతపురం రీజినల్ డైరెక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వస్త్ నారీ–సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే చెత్త చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ షేక్ ముబీనా, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్యురాలు తస్లీమా పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

డోన్ టౌన్: జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకుని, వారి వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. గురువారం కొట్లవారిపల్లె వద్ద ఎస్ఐ మమతతో కలిసి వాహన తనిఖీలు జరుపుతున్న సమయంలో బేతంచెర్ల నుంచి డోన్ వైపు వస్తున్న ఇద్దరు పోలీసులను చూడగానే బైకులను వదిలి పారిపోగా, సిబ్బంది వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు ఓర్లకల్లు మండలం బైరెడ్డినగర్‌కు చెందిన పరుతం జంగం శంకర్, ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామానికి చెందిన బొగ్గుల రవి (ప్రస్తుతం బేతంచెర్లలోని శేషారెడ్డినగర్‌లో నివాసం) అని గుర్తించారు. వీరిద్దరూ కొంతలపాడు గ్రామంలో పొలం పనుల సమయంలో పరిచయం పెంచుకుని, ఆ తర్వాత జల్సాలకు అలవాటు పడి రద్దీ ప్రదేశాల్లో బైకులను దొంగలించి, గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో విలాస జీవితం గడిపినట్లు తెలిపారు. ఈ నెల 15న చిన్నమల్కాపురం రైల్వే స్టేషన్‌లో ఒక బైక్, హైదరాబాద్‌లో మరో బైక్‌ను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్స్ నాగేష్, మద్దిలేటి, రవికుమార్ పాల్గొన్నారు.

హెచ్ కొట్టాలలో మరోసారి చోరీ



దుండగులు చోరీ చేసిన హోటల్



హరి హెయిర్ స్టైల్ షాపు వెనుక రేకును కత్తిరించిన దృశ్యం



అపహరణకు గురైన కారు టైర్లు

బేతంచెర్ల: మండలంలోని హెచ్ కొట్టాల గ్రామ పరిధిలో వరుస దొంగతనాలు గ్రామస్తులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున స్టేజీ వద్ద హోటల్, హెయిర్ స్టైల్ షాపులో దొంగతనం జరిగింది. వివరాలు.. హెచ్ కొట్టాల గ్రామానికి చెందిన రామకృష్ణ (బుజ్జి) భార్య సుజాతతో కలిసి 10 ఏళ్లుగా హోటల్ నిర్వహిస్తున్నారు. దాని పక్కనే రంగాపురం గ్రామానికి చెందిన హరి హెయిర్ స్టైల్ షాపు నడుపుతున్నాడు. బుధవారం రాత్రి తాళాలు వేసి వెళ్లగా గురువారం ఉదయం రేకులు కత్తిరించి చోరీ జరిగినట్లు గమనించారు. హోటల్ నుంచి రూ.16 వేల నగదు, సిగరెట్లు, హెయిర్ షాపు నుంచి రూ.7,200 నగదు, రెండు ట్రిమర్లు ఎత్తుకెళ్లారు. అదే సమయంలో ఇటీవల ప్రమాదవశాత్తు పొలంలో బోల్తా పడిన ఓ కారు రెండు టైర్లను కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ విషయాన్ని బాధితులు పోలీసులకు తెలపగా సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో గురువారం వేకువ జామున గ్రామస్తులు గస్తీ చేస్తూ జాతీయ రహదారి పక్కన అనుమానాస్పదంగా నిలిచిన ఒక స్కార్పియో వాహనాన్ని గుర్తించారు. అందులో ఉన్న వ్యక్తి సరిగా వివరాలు చెప్పకపోవడంతో వాహనం సహా పోలీసులకు అప్పగించారు. పరిశీలనలో వాహనంలో రెండు టైర్లు లభ్యమయ్యాయి. ఈ దొంగతనాలకు ఆ వ్యక్తికి సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈనెల 11న గ్రామంలో 6 ఇళ్లలో చోరీ జరిగి 15 తులాల బంగారం, రూ.1.92 లక్షల నగదు, 26 తులాల వెండి దోచుకెళ్లారు. 13న మరో ఇంట్లో చోరీకి యత్నించగా గమనించి పారిపోయారు. తాజా ఘటనలతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ దొంగలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మద్దిలేటిస్వామి ఆలయానికి బస్సు సర్వీస్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ఆర్టీసీ డిపో నుంచి మద్దిలేటిస్వామి క్షేత్రానికి ఈ నెల 20వ తేదీ నుంచి బస్సు సర్వీస్ ప్రారంభించనున్నట్లు డీఎం రవికిశోర్ గురువారం తెలిపారు. ప్రస్తుతం కటికవానికుంట వరకు ఉన్న సర్వీసును పొడిగించినట్లు చెప్పారు. ఈ బస్సు శుక్ర, శనివారం మాత్రమే ఉంటుందన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రామకృష్ణాపురంలో గుంతల పూడ్చివేత

ప్యాపిలి: మండల పరిధిలోని రామకృష్ణాపురంలో రహదారిపై ఏర్పడిన గుంతలను గురువారం సర్పంచ్ రావూరి పద్మావతి ఆధ్వర్యంలో పూడ్చివేశారు. గ్రామంలో తోటలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో అందులో మురుగునీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. కాలనీవాసుల కోరిక మేరకు డిప్యూటీ ఎంపీడీఓ ఆదేశాలతో గ్రామ పంచాయతీ నిధులు రూ. 50 వేలు వెచ్చించి 80 ట్రిప్పుల మట్టితో గుంతలను పూడ్చివేశారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

బనగానపల్లె రూరల్: విద్యార్థులు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. గురువారం కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతరిక్ష విప్లవ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష రంగంలో భారత విజ్ఞానం సాధించిన విజయాలను వివరించారు. విద్యార్థుల కోసం అంతరిక్ష ప్రయోగాలపై ఫొటో ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు.

బ్రాహ్మణ భవన నిర్మాణానికి స్థల విరాళం



స్థలం దస్తావేజులను అందజేస్తున్న దాతలు

డోన్ టౌన్: పట్టణ సమీప హైవే వద్ద బ్రాహ్మణ భవన నిర్మాణానికి వేదమాత బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు ఎం.నాగభాస్కర్ శర్మ, ఆయన సోదరి నాగరాజకుమారి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 11 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. గురువారం గాయత్రి పీఠంలో జరిగిన సమావేశంలో స్థలం దస్తావేజులను సంఘానికి అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు గండ్లూరి దత్తాత్రేయశర్మ రూ.లక్ష, అధ్యక్షుడు నంద్యాల శంకరశర్మ రూ.50వేలు విరాళం ప్రకటించారు.

రేపు వాహనాల వేలం

డోన్ టౌన్: డోన్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం వేలం పాట నిర్వహించనున్నట్లు ఆ శాఖ సీఐ వరలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు. వివరాల కోసం డోన్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

‘చలో మెడికల్ కాలేజీ’ని విజయవంతం చేద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె: నంద్యాలలో శుక్రవారం జరగనున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో జరిగిన సమావేశంలో పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తెచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని, 750 ఉచిత సీట్లను అందుబాటులోకి తెచ్చిన విద్యాదాతగా నేటికీ ప్రజలు కొనియాడుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదవానికి వైద్యవిద్యను దూరం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బనగానపల్లె, కోవెలకుంట్ల యువజన విభాగం అధ్యక్షులు టి. శ్రీనివాసరెడ్డి, భూపాల్‌రెడ్డి, జస్వంత్‌రెడ్డి, కోనపురం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కాటసాని ఇంటికి చేరుకోవాలి

శుక్రవారం ఉదయం 8 గంటలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహం వద్దకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన–విద్యార్థి సంఘాల నాయకులు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు తప్పక హాజరుకావాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

కోవెలకుంట్ల: మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్ ఆరోపించారు. గురువారం ఆయన కోవెలకుంట్లలో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. దీనిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగాలతో శుక్రవారం చలో మెడికల్ కాలేజీ పేరుతో నంద్యాలలోని మెడికల్ కాలేజీ వద్దకు శాంతియుతంగా వెళ్లి అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మహిళల ఆరోగ్యం బాగుంటేనే బలమైన కుటుంబం



పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

డోన్: మహిళల ఆరోగ్యం బాగుంటేనే బలమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుందని జిల్లా స్త్రీశిశు సంక్షేమ అధికారి లలిత అన్నారు. గురువారం స్థానిక 100 పడకల ప్రభుత్వాస్పత్రిలో ‘స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్’ కార్యక్రమం కింద మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత మాట్లాడుతూ..మహిళలు కుటుంబాన్ని నడిపించడంలో కష్టపడుతుంటారు కానీ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం మరిచిపోతున్నారని అన్నారు. శిబిరానికి హాజరైన సుమారు 500 మంది మహిళలు, కిశోర బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రి రెడ్‌క్రాస్ బృందం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 19 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ హనీఫ్, డాక్టర్ రమ్యశిల్ప, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, సీడీపీఓ షంషాద్‌బేగం, వైస్‌చైర్మన్ కోట్రికె హరికిషన్, సీఐ ఇంతియాజ్‌బాషా పాల్గొన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్ష



నందివర్గంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ మారుతిసకారామ్

బనగానపల్లె రూరల్: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ మారుతిసకారామ్ అన్నారు. గురువారం నందవరం పశువైద్యశాల పరిధిలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుందని, టీకా వేయించకపోతే రైతులు భారీ నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం వచ్చే నెల వరకు ఉచితంగా వ్యాక్సినేషన్ చేపడుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వీఏఓలు జయరామ్‌నాయక్, పీవీ పుల్లయ్య పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు

డోన్: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకా కార్యక్రమాన్ని వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని ఉడుములపాడు గ్రామంలో గురువారం టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పెయ్యదూడల ఉత్పత్తి పథకం కింద లింగనిర్ధారణ వీర్యాన్ని కేవలం రూ.150కే అందిస్తున్నామని, నూటికి నూరు శాతం ఆడదూడలు కావాలనుకునే పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెయ్యదూడల ఉత్పత్తి ద్వారా పశుపోషకులు ఆర్థికంగా లాభపడతారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నవ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వన్నూర్ బాషా సేవలు అభినందనీయం



వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి గడియారం అందజేస్తున్న బాషా

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా, సమాజ సేవకునిగా వన్నూర్ బాషా చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి మాజీ మంత్రి బుగ్గన చేతుల మీదుగా వన్నూర్ బాషా గోడ గడియారం బహూకరించారు. బాషా నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తూ ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, పాఠశాలలకు గోడ గడియారాలు అందించడం ప్రశంసనీయం అని బుగ్గన అన్నారు.